క్లుప్తంగా

మొన్న విన్నారు.. నేడు పైపులైన్ వేశారు



పైపులైన్ ఏర్పాటుకు గుంత తీస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్ : పట్టణంలోని 38వ వార్డు, నిజాముద్దీన్‌కాలనీ, ఖాజీపేట, ఎన్టీఆర్ కాలనీల్లో నీటి సమస్య అధికంగా ఉందని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గురువారం వార్డు కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆదివారం ఆయా కాలనీల్లో పర్యటించారు. సోమవారం జేసీబీతో పైపు లైన్ల ఏర్పాటుకు గుంతలు తవ్వే పనులు చేపట్టారు. దీంతో స్థానికులు అధికారుల పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు.

బాలికల చదువు దేశానికి వెలుగు

ఆదోని సెంట్రల్: బాలికల చదువు దేశానికి వెలుగు అని ఆంధ్రప్రదేశ్ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర మీడియా కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేసిందని చెప్పారు. పాఠశాలల్లో గతంలో కంటే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. బాలికలు కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు హెచ్. శ్రీనివాసులు పాల్గొన్నారు.

'సంకల్ప సంపూర్ణ స్వాస్థ్య' పై అవగాహన

ఆదోనిఅర్బన్ : ఆదోని ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ), ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సంయుక్తంగా సోమవారం స్థానిక అక్షరశ్రీ పాఠశాలలో 'సంకల్ప సంపూర్ణ స్వాస్థ్య (ఎస్ఎస్ఎస్)' పై అవగాహన సదస్సు నిర్వహించారు. తినే ఆహారం, వ్యాయామం, నిద్ర ప్రాముఖ్యత, పరిసరాల శుభ్రత, మానసిక ఆరోగ్యం, ఫోన్‌లు, టీవీలు ఎక్కువగా చూడకుండా ఉండడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సదస్సులో ఐఏపీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ రఘునాథ్, ట్రైనర్ డాక్టర్లు హరీష్, సూర్యదాస్, డాక్టర్ గోపీనాథ్, ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దకడబూరు : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నిర్వహించిన అథ్లెటిక్స్‌లోని పలు విభాగాల్లో పెద్దకడబూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని హెచ్‌ఎం ఉమారాజేశ్వరమ్మ సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ శ్రీకాంత్ 800మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, షాట్‌పుట్‌లో జయశాంతి రెండో స్థానం, పీ.ఉష నాలుగవ స్థానం కైవసం చేసుకున్నారన్నారు. 400 మీటర్ల విభాగంలో దివాకర్, వీరాంజనేయులు, శ్రీకాంత్, కృష్ణ రెండో స్థానం, వంద మీటర్ల పందెంలో పల్లవి నాలుగవ స్థానం కైవసం చేసుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు, పీడీ స్వర్ణలతను అభినందించారు.

హాస్టళ్లకు వార్డెన్‌లను నియమించాలి

ఆదోనిరూరల్ : ప్రభుత్వ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, హాస్టళ్లకు వార్డెన్‌లను నియమించాలని పీడీఎస్‌ఓ పట్టణాధ్యక్షుడు శివ కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో అభివృద్ధి పనులు చేపట్టి, మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో అధిక హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని సొంత భవనాలు నిర్మించాలని కోరారు. విద్యార్థులకు కాస్మోటిక్, మెయింటెనెన్స్ చార్జీలను అందించాలన్నారు. నాయకులు వీరేష్, ప్రవీణ్, రంగస్వామి, నీలకంఠ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

కోసిగి: పొదుపు సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని ఫైనాన్షియల్ లీగల్ కోఆర్డినేటర్ నరసింహులు విలేజ్ బుక్ కీపర్లకు సూచించారు. సోమవారం స్థానిక స్త్రీ శక్తి భవన కార్యాలయంలో ఏపీఎం సత్యమ్మ ఆధ్వర్యంలో విలేజ్ బుక్ కీపర్, గ్రామైక్య సంఘాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రతి మహిళ సభ్యురాలికి అవగాహన కల్పించాలన్నారు. బ్యాంక్ లింకేజీ ద్వారా తీసుకున్న రుణం సకాలంలో బ్యాంక్‌లకు చెల్లించి అధిక రుణాలు పొందాలని చెప్పారు. సీసీలు దస్తగిరి, రామన్న, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

నమో నారసింహో..

- ఈరన్న నామస్మరణంతో మారుమోగిన ఉరుకుంద క్షేత్రం
- రెండో సోమవారం సందర్భంగా పోటెత్తిన భక్తులు
- లక్షలాదిగా తరలివచ్చి ఇలవేల్పును దర్శించుకున్న జనం
- ఆలయానికి వచ్చే నాలుగు మార్గాల్లో కిలోమీటర్ల మేర వాహనాలతో కిక్కిరిసిన దారులు



ప్రత్యేక అలంకరణలో ఈరన్నస్వామి



తుంగభద్ర దిగువ కాలువలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్త జనం

కౌతాళం: నమో నారసింహో నామస్మరణతో ఉరుకుంద క్షేత్రం మారుమోగింది. శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండవ సోమవారం ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకునేందుకు క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాల్లో ఎటు చూసినా భక్తులే కనిపించారు. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు తమ ఇంటి ఇలవేల్పును దర్శించుకుని, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారుగా 2లక్షలకు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని అధికారులు దేవాలయాన్ని ఆదివారం రాత్రి నుంచి మూయకుండా 24 గంటల పాటు నిరంతరంగా పూజా కార్యక్రమాలు చేపట్టాలే చర్యలు తీసుకున్నారు. సోమవారం తెల్లవారుజామున 1గంట ప్రాంతంలో అరగంట దర్శనానికి విరామం కల్పించి సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. స్వామి వారి దర్శనం కోసం భక్తులు మూడు గంటలకుపైగా వేచి చూడాల్సి వచ్చింది. ఉచిత దర్శనం కోసం భక్తులు గంటల కొద్ది చంటి పిల్లలతో క్యూలైన్‌లలో నిరీక్షించారు. ముందుగా భక్తులు కేశఖండన చేయించుకొని తుంగభద్ర దిగువ కాలువలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని నిష్ఠతో దర్శించుకున్నారు. అధిక శాతం మంది భక్తులు క్షేత్ర ఆవరణలో పిండి వంటలు వండి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. దీంతో క్షేత్ర పరిసరాల్లో ఎక్కడ స్థలం దొరికితే అక్కడ వంటలు వండటం కనిపించింది. ఉరుకుందకు వచ్చే నాల్గు మార్గాలు భక్తులతో కిలోమీటరకు పైగా కిక్కిరిసిపోయాయి. సాయంత్రం వరకు రద్దీ తగ్గలేదు. ఉదయం ఆదోని డిపోవారు 40 బస్సులు, ఎమ్మిగనూరు డిపోవారు 20 బస్సులు ఉరుకుందకు నడిపారు. కర్ణాటకలోని శిరుగుప్ప డిపోవారు 10 బస్సులు, బళ్లారి, రాయచూరు డిపోవారు బస్సులను ఏర్పాటు చేశారు. కోసిగి సీఐ ఏరిషావలి ఆధ్వర్యంలో కౌతాళంలో ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రధాన అర్చ్ వద్ద భక్తుల కోలాహలం



ఆరుబయట పిండి వంటలు వండి పూజలు చేస్తున్న భక్తులు

నేడు జిహ్వేశ్వర్ జయంతి

ఆదోనిఅర్బన్ : జిహ్వేశ్వర్ జయంతి మహోత్సవ వేడుకలను ఆదోని స్వకుళసాళి (చేనేత) సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి జిందే లక్ష్మణ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 5 గంటల నుంచి విశేష పూజలు, అభిషేకాలు, బిల్వార్చనలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. వివిధ దేవస్థానాల భజన మండళ్ల ద్వారా జిహ్వేశ్వర నామ స్మృతితో 12 గంటలకు మహామంగళహారతి పూజ కార్యక్రమంతో ముగుస్తుందన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సాయంత్రం పుర వీధుల్లో జిహ్వేశ్వర్ ప్రతిమను ఊరేగిస్తామన్నారు. సమావేశంలో ఆలయ ధర్మకర్త చైర్మన్ సాక్రేగోపీ, పాణిభాతే శంకర్, కౌన్సిలర్‌లు గోవిందు, ఆనంద్ పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

ఆదోనిరూరల్ : పట్టణంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోయ నీలకంఠప్ప అధికారులను కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి గోవింద్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. నీలకంఠప్ప మాట్లాడుతూ అధికారుల అలసత్వం వల్ల నీటి సమస్య తలెత్తిందన్నారు. పట్టణంలోని 42 వార్డులకు తాగునీరు సరఫరా చేసేందుకు 2004లో బసాపురం గ్రామం వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మిస్తే.. మున్సిపాలిటీ అధికారుల అలసత్వం వల్ల పగుళ్లు వచ్చి నీరు లీకేజీ అయ్యి తాగునీరు వృథా అయ్యాయన్నారు. మరమ్మతులు చేసి పట్టణ ప్రజలకు సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని కోరారు. దిలీప్‌దోకా, మారుతిరావు, సాయినాథ్, దేవిశెట్టి వీరేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి



ప్రజల సమస్యలను వింటున్న పరిపాలనాధికారి గోవింద్‌సింగ్

ఆదోని రూరల్ : స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని, ఇందులో నిర్లక్ష్యం చేయొద్దని ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి గోవింద్ సింగ్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల ద్వారా వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, బీసీ వెల్ఫేర్ లక్ష్మినారాయణ, వ్యవసాయ శాఖ ఏడీఏ గిరీష్‌కుమార్‌రెడ్డి, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, గృహ నిర్మాణశాఖ డిప్యూటీ ఇంజనీర్ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, ఎస్సీ వెల్ఫేర్ సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యల్లో కొన్ని....

- హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామానికి చెందిన శ్రీశైలప్పకు సర్వే నంబర్ 291/బీలోని 10.77 ఎకరాలు ఉందని, హైకోర్టు ఉత్తర్వులు మేరకు ఆ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ అందజేశారు.
- ఆదోని పట్టణం మహాత్మాగాంధీనగర్‌లోని 21వ వార్డులో గత తొమ్మిది నెలలుగా విద్యుత్ ఓల్టేజ్‌తో కాలనీలో విద్యుత్ పరికరాలు చెడిపోతున్నాయని, సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు లక్ష్మన్న, ప్రమోద్‌కుమార్, స్వామిదాసు, తిరుమలేష్ అర్జీ సమర్పించారు.

ఆదోనిరూరల్ : మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను క్రమబద్ధీకరిస్తామనే మాటను సీఎం జగనన్న నిలుపుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె.అజయ్‌బాబు కోరారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి వెంకన్న, అధ్యక్షుడు భీమేష్, ఉప ప్రధాన కార్యదర్శి ప్రకాష్, సీపీఐ పట్టణ మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావి రాజు, మున్సిపల్ వర్కర్స్, యూనియన్ నాయకులు జాన్‌బాబు, జయరాజు పాల్గొన్నారు.

ఆదోనిటౌన్ : ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మవారం మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంని ర్వహించారు. వివిధ వార్డులకు చెందిన వారి నుంచి అర్జీలను స్వీకరించారు. అక్రమ కట్టడాల వల్ల ఇబ్బందులు పడుతున్నామని అరుంజ్యోతినగర్, ఆర్టీసీ కాలనీ ప్రాంతాలవాసులు కమిషనర్‌కు అర్జీ అందజేశారు. తాగునీటి సరఫరాలో సమయాలు పాటించడంలేదని, వేళాపాళా లేకుండా నీటి సరఫరా చేస్తున్నారని, దీంతో ఇబ్బందులకు గురవుతున్నామని పట్టణశివారు ప్రాంతాల ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. మైనార్టీ కాలనీలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని వినతి పత్రం అందజేశారు.

జోరుగా అదనపు తరగతి గదుల నిర్మాణాలు



ఆర్‌ఆర్ లేబర్ కాలనీలో తరగతి గదుల నిర్మాణాలు



గదిలో కొనసాగుతున్న ప్లాస్టింగ్ పనులు

ఆదోని సెంట్రల్: పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వం పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నాడు – నేడు కింద ప్రభుత్వం 109 పాఠశాలలకు రూ.1499.63 కోట్లను మంజూరు చేసింది. మొదటి విడతలో నాడు నేడు పనులు పూర్తి చేసుకున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణాలను చేపడుతున్నారు. మొత్తం 41 పాఠశాలల్లో 69 అదనపు తరగతి గదుల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. ఒక్కొక్క పాఠశాలకు రూ.12 లక్షల చొప్పున రూ.74.20 కోట్ల వెచ్చిస్తున్నారు. గదుల నిర్మాణాలు పూర్తైయితే పురపాలక, నెహ్రూ మెమోరియల్, ఆర్‌ఆర్ లేబర్ కాలనీ, ప్రభుత్వ బాలిక వంటి ఉన్నత పాఠశాలల్లో గదుల కొరత సమస్య తీరుతుంది. అదనపు తరగతి గదుల నిర్మాణాలతో పాటు నాడు నేడు కింద పనులు జరుగుతన్న పాఠశాలల్లో టాయిలెట్, బాత్రుం, వంటగదులు, విద్యుత్ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ బి.శివరాములు సూచించారు.

నరహరి తీర్థ వసతి గృహం ప్రారంభం



నరహరి తీర్థ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



నిత్య జ్యోతితో శ్రీమఠంలో పీఠాధిపతి మహంతస్వామి

మంత్రాలయం : మాధవరం రోడ్డులో కొత్తగా నిర్మించిన నరహరి తీర్థ వసతి గృహాన్ని మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సోమవారం రాత్రి ప్రారంభించారు. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య ప్రారంభ కార్యక్రమం పూర్తి చేశారు. రూ.7 కోట్ల వ్యయంతో నిలయాన్ని నిర్మించారు. కార్యక్రమంలో పండితకేసరి గిరియాచార్, శ్రీమఠం మేనేజర్–1 శ్రీనివాసరావు, మేనేజర్–2 వెంకటేష్‌జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య పాల్గొన్నారు.

అలరించిన హరికథా పారాయణం

చాతుర్మాసాన్ని పురస్కరించుకుని మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య కార్యక్రమాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో సోమవారం హరికథా పారాయణం నిర్వహించారు. కర్ణాటక కళాకారిణి హరికథ ప్రవచనం, కీర్తన విభావరి చేపట్టారు. పారాయణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉరకుంద ఈరన్న స్వామి భక్తుల రాకతో శ్రీమఠం రద్దీగా మారింది.

శ్రీమఠంలో విరక్తి మఠం పీఠాధిపతి

కర్ణాటకలోని బాగల్‌కోట్ జిల్లా బనహట్టి విరక్తి మఠం పీఠాధిపతి మహంతస్వామి సోమవారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా ఆయన గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకుని అర్చనలు చేసుకున్నారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూలబృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిత్య జ్యోతి శ్రీశైలం వెళ్తున్నట్లు స్వామిజీ పేర్కొన్నారు. స్వామిజీతో పాటు మఠం ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ ఉన్నారు.

వేడుకగా నాగదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ పవిత్ర పాటిల్

కోసిగి: స్థానిక శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో వెలసిన రావి, వేపచెట్టుకు వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ వివాహం జరిపించారు. అలాగే.. చెట్టు దిగువ భాగంలో నాగ దేవతల విగ్రహాలను వేడుకగా ప్రతిష్ఠించారు. శ్రావణ మాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ గౌడల ఆధ్వర్యంలో కుంకుమార్చన, పంచామృతాభిషేకం, హోమాలు, మహా మంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, జెడ్పీటీసీ సభ్యురాలు పవిత్ర పాటిల్, మహంతేష్ స్వామి, యల్లమ్మవ్వ ఆలయ పూజారులు పూజల్లో పాల్గొన్నారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలోని హుండీల ఆదాయం లెక్కింపును మంగళవారం నిర్వహిస్తామని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ వాణి సోమవారం తెలిపారు. శ్రావణమాసం ఉత్సవాల సందర్భంగా హుండీ సొమ్ము లెక్కింపు జరగలేదని, ఇది మొదటి లెక్కింపు అని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొనే వారు పంచ, ఉత్తరీయం ధరించి రావాలని కోరారు.

జింకల బారి నుంచి పంటలను రక్షించండి

కౌతాళం: జింకల బారి నుంచి పంటలను రక్షించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య మాట్లాడుతూ.. రైతులు సాగు చేసిన వేరుశనగ, మిరప, కంది,జొన్న, సజ్జలు, కొర్రలు తదితర పంటలు వర్షాలు లేక ఏపుగా పెరగలేదని, వాటిని జింకలు తినేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాలకు కంచె వేసినా కాపలా ఉంటున్నా, శబ్దాలు చేసినా పైర్లను తినేస్తున్నాయని చెప్పారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టలని కోరారు.నాయకులు ఉలిగయ్య, నారాయణ, వెంకోబ, వీరేష్, సత్యప్ప, వలి, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు సొంత భవనం నిర్మించాలి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఎన్.రామయ్య పురపాలక ప్రాథమిక పాఠశాలకు సొంత భవనం నిర్మించాలని బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పగడాల రమేష్ కోరారు. సోమవారం కర్నూలు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కోట్ల విజయభాస్కరెడ్డి కాలనీలో పాఠశాలకు సొంత భవనం లేక అద్దె భవనంలో నడుపుతున్నారని చెప్పారు. ఆ భవనం కూడా పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుంది. ప్రభుత్వం నాడు–నేడు కింద రూ.42 లక్షలు మంజూరు చేసిందని, అయితే కేవలం రూ.8 లక్షలు విడుదల చేశారని చెప్పారు. 106 మంది విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాలకు ఒగ తరగతి గది. వంటగది టాయిలెట్ నిర్మాణాలను చేపట్టారని, అవి సరిపోవన్నారు. సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్ స్పందించి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకొంటామని హామీనిచ్చారు.

శాస్త్రోక్తంగా వీరభద్రుడి విగ్రహ ప్రతిష్ఠాపన

మంత్రాలయం : స్థానిక పాతూరులో ఇటీవల వీరభద్రస్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. సోమవారం వీరశైవ లింగాయతులు ఆలయంలో స్వామి వారి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేద మంత్రోచ్చారణలు మధ్య శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపనోత్సవం జరిపించారు. ఉదయం పుర వీధుల్లో వీరభద్రుడి వేషధారణ, పావుకోళ్ల సేవలో విగ్రహాన్ని ఊరేగించారు.

దోపిడీకి హద్దేదీ!

- ఉరుకుంద క్షేత్రంలో మితిమీరిన వసూళ్లు
- రెండు టెంకాయల రేటు రూ.70
- కేశఖండనలో తలకు రూ.100 అదనంగా వసూలు
- సబ్ కలెక్టర్ ఆదేశాలు తుంగలో తొక్కిన ఆలయ అధికారులు



ఉరుకుంద క్షేత్రం



కల్యాణ కట్టలో డబ్బు వసూలు చేస్తున్న దృశ్యం



టెంకాయల అంగళ్లు

మంత్రాలయం : ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో దోపిడీ రాజ్యమేలుతోంది. అధికారుల వత్తాసుతో కాంట్రాక్టర్లు భక్తులను నిలువునా దోచుకుంటున్నారు. వసూళ్లపై భక్తజనులు మొత్తుకుంటున్నా పట్టించుకునే నాథుడు లేడు. అటు టెంకాయలు, ఇటు తలనీలాలు, మరోవైపు హోటళ్లు, ఇంకో వైపు అంగళ్ల వ్యాపారులు ఎవరికి వాళ్లు వారిని పీల్చి పిప్పి చేస్తున్నారు. ధరల విషయంపై ఇప్పటికే ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు కూడా. అయినా ఆయన ఆదేశాలు బుట్ట దాఖలయ్యాయి. దోపిడీని అరికట్టేదెవరని భక్తులు గగ్గోలు పెడుతున్నారు. రెండో సోమవారం లక్షలాదిగా వచ్చిన భక్తాదులు వ్యాపారుల దోపిడీ చూసి బెంబేలెత్తిపోయారు.

గుండుకు వంద చెల్లించాల్సిందే..

తిరుమల తిరుపతి వెంకన్న, శ్రీశైలం మల్లన్న తర్వాత ఉరకుంద ఈరన్నకు తలనీలాలు సమర్పించేందుకు భక్తులు ఎక్కువగా మక్కువ చూపుతారు. అదే మొక్కుబడిని ఆసరాగా చేసుకుని క్షురకులు దోపిడీకి తెరతీశారు. తలనీలాలు సమర్పణ కోసం ఒక్కరికి రూ. 25 చొప్పున టిక్కెట్ తీసుకుంటున్నారు. గుండు కొట్టేందుకు కల్యాణ కట్ట కాంట్రాక్టర్లు ఉన్నారు. రూ.25 టిక్కెట్ కాదని తలకు రూ.100 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. గతంలో రూ.20 నుంచి రూ.50 వరకు వసూలు చేసేవారు. ఈ ఏడాది కచ్చితంగా రూ. వంద చెల్లించాల్సిందేనని మరీ డిమాండ్ చేస్తుండటంతో భక్తులు తప్పనిపరిస్థితుల్లో ముట్టజెబుతున్నారు. మరికొందరు ఎందుకు చెల్లించాలని వారితో వాదనకు దిగుతున్నా.. ఇష్టమున్న చోట చెప్పుకో.. ముందు అడిగిన కాడికి ఇచ్చి బయటకు కదులు అంటూ దబాయిస్తున్నారు. ఆలయ అధికారులు వెనకేసుకునే పనిలో దోపిడీని చూసీ చూడనట్లు వదిలేస్తున్నారని భక్తులు మండిపడుతున్నారు.

చెప్పిందే ధర..

కల్యాణ కట్ట తరహాలో ఇంకో ప్రధాన దోపిడీ.. టెంకాయలు. ఉరకుంద ఈరన్న స్వామికి జోడు టెంకాయలు, బియ్యం, బేడలు సమర్పించడం ఆనవాయితీ. ఇదే ఆసరాగా చేసుకున్న టెంకాయల విక్రయాలు దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండు టెంకాయలపై రూ.15 వరకు ఆదాకు తెరతీశాడు. కాంట్రాక్టర్‌తో టెంకాయలు కొనుగోలు చేసిన వ్యాపారులు ఏకంగా రెండు టెంకాయలకు రూ.70 ధర కట్టేశారు. ఊది బత్తీలు, విభూతి, కుంకుమ, విడి పూలు జోడించి ఏకంగా రూ.100 కు విక్రయిస్తున్నారు. కేవలం రూ.40 విలువ జేసే వస్తువులను రూ.వంద వసూలు చేస్తూ నిలువు దోపిడీకి పూనుకుంటున్నారు.

ప్రైవేటు దోపిడీ..

ఇక్కడ ఆలయ దగా తరహాలో ప్రైవేటు దోపిడీ సైతం సాగుతోంది. రూ.5 విలువ జేసే స్నానపు సబ్బు రూ.10, రూ.2 విలువ కల్గిన షాంపు రూ.5, ప్రతి దానికి రెండింతలు మించి రేట్లు జోడించి దోచుకుంటున్నారు. పుణ్య స్నానాలకు వెళ్లే ప్రతి భక్తుడు ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో దోపిడీ గురవుతున్నారు. ఇక ప్రైవేటు హోటళ్లలో ప్లేటు పూరి రూ.50, ఉగ్గాని రూ.30, దోసె రూ.40, భోజనం రూ.100 ప్రకారం వసూలు చేస్తున్నారు. ఉత్సవాలను అదునుగా చేసుకుని దోపిడీ తెగబడుతుండటంతో కళ్లు తేలేయడం భక్తుల వంతవుతోంది.

సెల్ ఫోన్ల భద్రతలో స్వార్థం..

మహానంది, యాగంటి, అహోబిలం లాంటి క్షేత్రాల్లోలేని సరికొత్త సంస్కృతిని అధికారులు తీసుకొచ్చారు. సాధారణంగా భక్తులు ఎవ్వరూ సెల్ ఫోన్లలో స్వామి మూలవిరాట్ చిత్రాలు తీసే పరిస్థితి లేదు. అయితే ఇక్కడి అధికారులు స్వార్థం కోసం కొత్తగా సెల్ ఫోన్ డిపాజిట్ విధానం అమలుకు శ్రీకారం చుట్టారు. ఒక సెల్ ఫోన్ భద్రపరుచుకునేందుకు రూ.5 వసూలు చేయాలని ప్రతిపాదించారు. వాస్తవంగా స్థానిక క్షేత్రం సెల్ భద్రపరుచు విభాగం ఏర్పాటు అవసరం లేదని భక్తాదులు పేర్కొంటున్నారు. ఇందులోనూ అధికారుల చేతివాటం దాగి ఉందని భక్తులు వాపోతున్నారు.

దోపిడీని అడిగే నాథుడు లేడు



నా పేరు పరశురాం, మాది నవరోజీ గ్రామం అయిజ మండలం. మా కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడి వచ్చాం. ఇక్కడ తలనీలాలు చేయించుకునేందుకు వెళ్లగా ఒక్కొక్కరికీ రూ.100 చొప్పున వసూలు చేశారు. ఎందుకని ప్రశ్నిస్తే తమనే దబాయించారు.

– పరశురామ్, నవరోజీ గ్రామం, అయిజ మండలం

వసూళ్లు దారుణం



ఎంతో దూరం నుంచి స్వామి మొక్కు తీర్చుకునేందుకు ఇక్కడికి వచ్చాం. అయితే ఇక్కడ అడుగడుగునా దోపిడీ జరుగుతోంది. ఆలయ కల్యాణకట్ట, టెంకాయలు, సెల్‌ఫోన్ల కోసం ఇష్టారాజ్యంగా డబ్బు తీసుకుంటున్నారు. తలనీలాలు సమర్పించేందుకు మా కుటుంబ సభ్యులు ఇద్దరు టిక్కెట్లు తీసుకున్నాం. రూ.20 తక్కువగా ఉందని చెప్పినా ఇక్కడ గుండు గీయలేదు. ఇంతలా దోచుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– గోవిందు, మాచర్ల